క్లుప్తంగా

కలుషిత నీటి సరఫరా కాకుండా చూడాలి



నిషాంత్ స్కూల్ గల్లీలో డ్రైనేజీ నీళ్లు కలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీనాథ్

రంగారెడ్డినగర్: గాంధీనగర్‌లోని రోడ్డు నం.8లోని నిషాంత్ స్కూల్ గల్లీ, రోడ్డు నం.11లో వారం రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ విషయమై స్థానికులు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. దీంతో గురువారం తాగునీరు కలుషితమవుతున్న ప్రాంతాన్ని పరిశీలించిన లక్ష్మీనాథ్ జలమండలి మేనేజర్ పూజిత దృష్టికి తీసుకువెళ్లారు. కలుషిత నీరు సరఫరా కాకుండా చూడాలని ఆమెను కోరారు.

విద్యార్థినికి చేయూత

సనత్‌నగర్: నిరుపేద విద్యార్థినికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, టీటీడీ ఎల్ఏసీ మెంబర్ వెల్లాల రామ్మోహన్ ఆర్థిక చేయూతనందించారు. ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లోని శాంతినికేతన్ కళాశాలలో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం (సీఈసీ) చదువుతున్న అస్రా సోఫికి అడ్మిషన్ ఫీజు మొత్తాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ.. నిరుపేదలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. మహానేత వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాల సాధనకు తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పేదింట ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిర పడ్డారంటే అది వైఎస్సార్ పుణ్యమే అన్నారు.

సమస్యల పరిష్కారానికి పరిశోధనలు అవసరం

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక సమస్యల పరిష్కారానికి పరిశోధనలు అవసరమని ఐసీఎస్ఎస్ఆర్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రిచా శర్మ అన్నారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రిచా శర్మ పరిశోధన ప్రతిపాదన రచన అనుబంధ సమాచారం అనే అంశం పై మాట్లాడారు. దేశంలో ఐసీఎస్ఎస్ఆర్ పనితీరు, లక్ష్యాలు, సాధించిన విజయాలను ఆమె వివరించారు. పరిశోధనల ప్రాజెక్టు లు, ఫెలోషిప్‌లు, ట్రావెల్ గ్రాంట్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఢిల్లీ, తమిళనాడు నుంచి ఎక్కువగా పరిశోధన ప్రతిపాదనలు వస్తున్నాయన్నా రు.

విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి

సనత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి అన్నారు. బేగంపేట డివిజన్ పరిధిలోని ఓల్డ్ పాటిగడ్డలోని బండిమెట్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం ఆమె చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. మన బస్తీ–మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

డా. పట్లోళ్ల నాగిరెడ్డికి సన్మానం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు పట్లోళ్ల నాగిరెడ్డి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయనను భరత్‌నగర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్లోళ్ల నాగిరెడ్డి చేసిన సేవలను సీనియర్ సిటిజన్స్ గుర్తు చేసుకున్నారు. ఢిల్లీ స్థాయిలో మన భరత్ నగర్ పేరును తీసుకెళ్లిన ఘనత కూడా నాగిరెడ్డికే దక్కిందన్నారు.

రేషన్ దుకాణం నడపడం కష్టం

- ప్రతి నెల రూ.30 - 40వేల వేతనం ఇవ్వాలి
- కమీషన్‌ను 3నెలలకు కాకుండా ప్రతి నెల ఇవ్వాలి
- మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి: రేషన్ డీలర్లు



జగద్గిరిగుట్ట, రాజీవ్‌గృహకల్పలోని రేషన్ షాపు (ఫైల్‌ఫొటో)

జగద్గిరిగుట్ట: క్వింటల్ బియ్యానికి వారికి ప్రభుత్వం నుంచి వచ్చే కమిషన్ కేవలం 70 పైసలు. వచ్చే ఈ కమీషన్ కూడా 3 నెలలకు ఒక్కసారి వస్తుంది. దాని కోసం నెలలో 25 రోజుల పాటు కష్టపడాలి. ఇదీ ప్రస్తుతం రేషన్ డీలర్ల పరిస్థితి. చిన్న డీలర్ల పరిస్థితి మరీ దారుణం. సుమారు 600 రేషన్‌కార్డులు ఉన్న డీలర్‌కు 80 క్వింటల్ బియ్యం సరఫరా అవుతోంది. అంటే క్వింటల్‌కి 70 పైసల చొప్పున డీలర్‌కు వచ్చే ఆదాయం 5,600 రూపాయలు. దీనిలో గుమాస్తా జీతం, షటర్ అద్దె, హమాలీ, కరెంట్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఇదీ కాక రేషన్ వినియోగదారులకు సరఫరా చేసే సమయంలో వాటి నుంచి వచ్చే ధూళితో శ్వాసకోశ వ్యాధితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- తమకు రేషన్ షాపు నడపడం కష్టమవుతోంది. తమకు కనీస గౌరవ వేతనం రూ.30వేల నుంచి రూ.40వేల వరకు చెల్లించాలని ప్రధాన డిమాండ్‌గా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.
- ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘాల ఐక్య వేదిక (జేఏసీ) ఈ నెల మొదటి వారంలో 6వ తేదీ వరకు తమ హక్కులకై తెలంగాణ వ్యాప్తంగా రేషన్ షాపులు బంద్ చేసారు. సమస్య తీవ్రతకు తెలుసుకున్న పౌర సరఫరాల మంత్రి గంగుల కమలాకర్ ఈనెల 7వ తేదీన 33 జిల్లాల అధ్యక్షులతో సెక్రటేరియట్‌లో సమావేశం నిర్వహించారు.
- రేషన్ డీలర్ల డిమాండ్‌లను మంత్రి దష్టికి తీసుకెళ్తే మంత్రి సానుకూలంగా స్పందించారు. జూలై మొదటి వారంలో తిరిగి సమావేశం నిర్వహించి తమ డిమాండ్‌లను సాధ్యమైనంత వరకు పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో రేషన్ డీలర్లు బియ్యం సరఫరా చేయడం మొదలుపెట్టారు.

కమీషన్ ప్రతినెల ఇవ్వాలి..



గోదాముల నుంచి ప్రతి బ్యాగ్‌లో బియ్యం తక్కువగా వస్తున్నాయి. అది మా తప్పుగా భావించి విజిలెన్స్ అధికారులు కేసులు వేస్తున్నారు. వచ్చే కమీషన్ కూడా ప్రతి నెల జమ చేస్తే బాగుంటుంది.

– ఇంద్రసేనా గుప్తా, బాలానగర్ సర్కిల్ రేషన్ డీలర్ల అధ్యక్షుడు

మమ్మల్ని గుర్తించాలి..



ప్రాణాలను లెక్క చేయకుండా కరోనా సమయంలో బియ్యం సరఫరా చేశా. చాలా మంది డీలర్లు చనిపోయారు. వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కూడా అందలేదు. ఇప్పటికైనా మమ్మల్ని గుర్తించాలి.

– మధుసూదన్ యాదవ్, రేషన్ డీలర్ల ప్రధాన కార్యదర్శి

పరిపాలన వికేంద్రీకరణతో మెరుగైన సేవలు

- ఎమ్మెల్యే వివేకానంద్



కుత్బుల్లాపూర్: పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సీఎం కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్‌లు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని ఎనిమిది డివిజన్లలో వార్డు కార్యాలయాలను ప్రారంభిస్తున్నట్లు గురువారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. వికేంద్రీకరణ ద్వారా అన్ని విభాగాల అధికారులు ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.ఏ సమస్య తలెత్తినా వారి దృష్టికి తీసుకువెళ్తే వెంటనే పరిష్కార మార్గాలు చూపుతారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవాలకు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

డివిజన్ల వారీగా వార్డు కార్యాలయాలు

- గాజులరామారం డివిజన్‌లో మహదేవపురం సామాజిక భవనం
- జగద్గిరిగుట్ట డివిజన్‌లోని జగద్గిరిగుట్ట మోడల్ మార్కెట్ భవనం
- చింతల్ డివిజన్‌లో భగత్ సింగ్‌నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్
- సూరారం డివిజన్‌లో నెహ్రూనగర్ సామాజిక భవనం
- రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్ కమ్యూనిటీహాల్
- సుభాష్‌నగర్ డివిజన్‌లో సుభాష్‌నగర్‌లోని గణేష్ గ్రౌండ్
- కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని పద్మనగర్ ఫేజ్–2 కమ్యూనిటీహాల్
- జీడిమెట్ల డివిజన్‌లోని గాయత్రినగర్ మోడల్ మార్కెట్ భవనం

కూల్చివేత రణరంగం



జేసీబీకి అడ్డంగా కూర్చున్న స్థానికులు

- అడ్డుకున్న స్థానికులు
- ఇద్దరిపై కేసు నమోదు



సుభాష్‌నగర్: గాజులరామారంలోని బాలయ్యనగర్‌ను ఆనుకుని 307, 308 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన కబ్జాలపై రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేసేందుకు వెళ్లగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ సర్వే నెంబర్లలో కొంత ప్రైవేటు స్థలం పట్టా ఉండగా ఇదే అదునుగా కొంతమంది కబ్జాదారులు ఎకరాల కొద్ది ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి వెంచర్ చేశారు. మరికొందరు గదులు నిర్మించారు. ఈ విషయమై ఉన్నత అధికారులకు ఓ వ్యక్తి ట్విట్టర్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో గాజులరామారం సర్కిల్ కమిషనర్ ప్రశాంతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుక సంయుక్తంగా గదులను కూల్చివేసేందుకు గురువారం ఉదయం వెళ్లగా స్థానికులు పెద్ద ఎత్తున పోగై అడ్డుకున్నారు. దీంతో అధికారులకు స్థానికులకు మధ్య వాగ్వాదం చేసుకోవడంతో రణరంగంగా మారింది. ఎట్టకేలకు రెండు గదులను అధికారులు కూల్చివేసి వెనుదిరిగారు. అనంతరం తమ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మెరుగైన పాలన అందించేందుకు కృషి



పట్వారీ ఎన్‌క్లేవ్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయ

రంగారెడ్డినగర్: ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్‌లో ప్రగతియాత్ర చేపట్టిన ఆయన కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌తో కలిసి పట్వారీ ఎన్‌క్లేవ్‌లో రూ.35 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. కాలనీలో పార్క్‌ను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ జయరామ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఓంకార్ రెడ్డి, జల్దా లక్ష్మీనాథ్, కార్తీక్‌గౌడ్, క్రాంతి యాదవ్, శ్రీను, సాయి కిరణ్, యాదగిరి, మహిళా నాయకురాలు రాణి, భారతి, ఈశ్వరి, కాలనీవాసులు వెంకటేష్, లక్ష్మణ్, శంకర్ రావు, సతీష్ గట్టోజీ, యాదగిరి, మహబూబ్, బాలు నేత, అల్లావుద్దీన్ తదితరులు ఉన్నారు.

- జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 100 దేవాలయాలకు ధూప దీప నైవేద్య పథకం మంజూరైన నేపథ్యంలో అర్చక సంఘం ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఉన్న 75 దేవాలయాలకు ఈ పథకం మంజూరు చేయడంతో కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. జీహెచ్ఎంసీ ధూపదీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు శ్రీరంగం గోపికృష్ణమాచార్యులు, రఘు స్వామి, చంద్రప్రకాష్, శివకుమార్ తదితరులు ఉన్నారు.
- జీడిమెట్ల డివిజన్ పరిధిలోని గోదావరి హోమ్స్‌లో రూ.69 కోట్ల ఎస్ఎన్‌డీపీ నిధులతో చేపడుతున్న వరదనీటి నాలా పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో మిగిలిన 10 శాతం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. డీఈఈ నరేందర్, ఏఈ రామారావు తదితరులు ఉన్నారు.

అవినీతిలో కూరుకుపోయిన కేసీఆర్ పాలన

- ప్రకాశ్ జవదేకర్

రాంగోపాల్‌పేట్: తెలంగాణలోని కేసీఆర్ ప్రభుత్వం అవినీతితో కూరుకుని పోయిందని మాజీ కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. గురువారం రాత్రి సికింద్రాబాద్‌లోని వెస్లీ జూనియర్ కళాశాలలో సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన వ్యాపారులు, న్యాయవాదులు, వైద్యులు, వివిధ రంగాల్లోని ప్రముఖులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతితో పాటు కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. మోదీ 9 ఏళ్ల పాలనలో అంతర్జాతీయ స్థాయిలో మనదేశ ప్రతిష్ట పెరగడంతోపాటు అన్ని దేశాలతో సత్సంబంధాలు నెరపడంతో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఎలాంటి అవినీతి మచ్చ లేకుండా, పారదర్శకమైన పాలన కేంద్రం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మోదీ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు. నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, కార్పొరేటర్లు దీపిక, సుచిత్ర, సరళ, జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది రవీందర్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక మహిళ ఆత్మహత్య

జీడిమెట్ల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ గృహిణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ రెడ్డి వివరాల ప్రకారం.. చింతల్ చంద్రానగర్‌కు చెందిన సత్యవాణి(41), రాజశేఖర్ భార్యాభర్తలు వీరి ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజశేఖర్ ఓ పరిశ్రమలో ఉద్యోగం చేస్తుండగా సత్యవాణి ఇంట్లోనే ఉండేది. గురువారం ఉదయం 11గంటలకు సత్యవాణి కుమారుడు, భర్తతో బెడ్‌రూమ్‌లో ముచ్చటించింది. అనంతరం వంట చేస్తానని బెడ్‌రూం నుండి బయటకు రాగానే భర్త, కుమారుడు పడుకున్నారు. వారు పడుకున్నట్లు గమనించిన సత్యవాణి చీరతో హాల్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కొద్దిసేపటికి బయటకు వచ్చిన కుమారుడు చూసేసరికి సత్యవాణి ఉరివేసుకుని ఫ్యాన్‌కు వేలాడుతూ ఉంది. చుట్టు పక్కల వారి సహాయంతో కిందికి దింపి చూడగా సత్యవాణి అప్పటికే మృతిచెంది ఉంది. భర్త రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా సత్యవాణి కుటుంబ సభ్యులకు తెలియకుండా రూ.5లక్షలు అప్పు చేసినట్లు సమాచారం.

బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి న్యాయంచేస్తాం



సాయినగర్‌లో పర్యటిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి తదితరులు..

నిజాంపేట్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న బ్యాగ్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గురువారం ఆయన నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి సాయినగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విధానాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ మద్దతు తెలపాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొలన్ రాజశేఖర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, జీతయ్య, శంకర్, మధుసూదన్‌రెడ్డి, అంజద్, కొలన్ జీవన్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి, వీరబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2లోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మితమైన 41 రోజులు పూర్తయిన నేపథ్యంలో మండల పూజ, హోమం, అభిషేకం నిర్వహించగా నిజాంపేట మేయర్ నీలారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేయగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ నీలారెడ్డి చేతుల మీదుగా ఆలయ పూజారులకు నూతన వస్త్రాలు, కానుకలను అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, డివిజన్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మహిళా నాయకురాలు సబిత, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాం



ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజుకు సమస్యను వివరిస్తున్న ప్రజలు

దుండిగల్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. గురువారం శంభీపూర్‌లోని కార్యాయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. వీటిపై స్పందించిన శంభీపూర్‌రాజు సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు.

గాజులరామారంలో పాదయాత్ర చేస్తున్న రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు



మహా జన సంపర్క్ అభియాన్

సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీకి బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మహా జన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా గాజులరామారం డివిజన్‌లో నాయకులు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాష్ట్రానికి కేటాయించిన నిధులను ప్రజలకు వివరించారు. డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గారిగే శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎంఎస్ వాసు, డివిజన్ అధ్యక్షుడు పులి బలరామ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్ పాటిల్, డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్, బీజేవైఎం డివిజన్ జనరల్ సెక్రటరీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్.. ప్రజలు పరేషాన్

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం పడిగాపులు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో మూడు రోజు నుంచి సర్వర్ డౌన్ కారణంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం ఆలస్యం అవుతోంది. ఇటీవల బీసీ వృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థిక పథకం, పై చదువులు, ఉద్యోగ నిమిత్తం విషయమై గత వారం రోజుల నుంచి కుల, ఆదాయ పత్రాల కోసం గాజులరామారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి తాకిడి పెరిగింది. తాజాగా గురువారం జనాలతో కిక్కిరిసిపోయింది.

- ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో ఓ వైపు సర్వర్ డౌన్ కారణంగా ప్రక్రియ నెమ్మదిగా జరుగుతుంటే.. మరోవైపు దరఖాస్తు పెట్టుకున్న ఎన్ని రోజులు రావాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు మాట్లాడుతూ.. నాలుగు రోజుల వ్యవధిలోనే కుల, ఆదాయ పత్రాల కోసం 8 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని అన్నారు. సర్వర్ డౌన్ కారణంగా రాత్రి 2గంటల వరకు సిబ్బందితో అయినంత వరకు చేస్తున్నామని అన్నారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు



ఉదయం 10గంటల నుంచే ఫైళ్లపై సంతకం చేస్తున్న తహసీల్దార్ సంజీవరావు

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిని సత్కరిస్తున్న



వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయని.. వచ్చేది తమ ప్రభుత్వమేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. గురువారం ఆయన కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 16, 17, 18 వార్డుల్లో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకుంటూ తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు భూపతిరెడ్డి ప్రజలకు వివరిస్తూ యాత్రను కొనసాగించారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1992లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 420 మంది పేదలకు 120 గజాల చొప్పుల ఇళ్లస్థలాలను అందించామన్నారు. తిరిగి 2010లో మరో 620 మంది పేదలకు పట్టాలు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమానికి పాటుపడేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమని భూపతిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మునిసిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్‌గౌడ్, కౌన్సిలర్ బైరి సరిత, పీఏసీఎస్ డైరెక్టర్ దప్పు నరేందర్, బైరి శివకుమార్‌గౌడ్, పోశెట్టి నగేష్, శివాజీ, కిరణ్, నవీన్, మహేష్, దొడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.